కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 19, క్యాప్సికమ్ 31, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

రసూల్‌పురా: సృష్టికి మూలమైన మహిళలను కేవలం మహిళా దినోత్సవం రోజే కాకుండా నిత్యం గౌరవించుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లోకయానకస్తనక్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్ సఖి నిలయంలో ఆదివారం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి చెందాలంటే విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. లోకయానస్తనక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తులసి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

అడ్డగుట్ట: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్లు దోహదపడుతాయని విద్యా వాహిని హైస్కూల్ ప్రిన్సిపల్ గోపాలకృష్ణ అన్నారు. తుకారాంగేట్‌లోని విద్యా వాహిని స్కూల్‌లో ఆదివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులు పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అదే విధంగా చంద్రయాన్, కాళేశ్వం ప్రాజెక్ట్ ప్రదర్శనలు కూడా చేశారు.

‘దేవనార్’లో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో దళిత చైతన్య సంఘం ప్రతినిధులు

సనత్‌నగర్: బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలలో ఆదివారం దళిత చైతన్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంఘం వ్యవస్థాపకులు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాదిగ మాట్లాడుతూ సమాజ సేవలో కలిగే ఆత్మ సంతృప్తి మరెందులోనూ ఉండదన్నారు. దళిత చైతన్య వేదిక అట్టడుగు వర్గాలు, పేద మధ్య తరగతి ప్రజలకు అండగా నిలబడి వారి హక్కుల పరిరక్షణకు అలుపెరగని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అభిషేక్, సతీష్‌రాజ్, సాయి, వెంకట్, మనోజ్, విశాల్‌సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నారీశక్తిని నలుదిశలా చాటాలి

వెల్లాల రామ్మోహన్

సనతనగర్: నారీశక్తిని నలుదిశలా చాటి దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలకు బిగోనియస్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతుండడం సంతోషకరమన్నారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా మహిళలు కూడా వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో అనురాధ, లక్ష్మీ, స్వప్నగుప్తా, లత, కుసుమ, పల్లవిలతో పాటు సుబ్బారావు, చారి, రవిచంద్ర, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు మొక్కలను అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

కమనీయం..శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలో శ్రీమదలర్మేల్‌మంగా పద్మావతీ సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణ ఘట్టం కన్నుల పండువగా జరిగింది. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కల్యాణోత్సవం కొనసాగింది. అశేష భక్తజనం గోవింద నామస్మరణతో ఈ ఉత్సవాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి వారిని సనత్‌నగర్ పురవీధుల్లో మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులతో శ్రీవారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌జోషి, రిపుంజయశర్మ, అనిల్‌ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల ప్రతిష్ఠా వార్షికోత్సవాలు..

అదేవిధంగా హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీమల్లికార్జునస్వామి, దుర్గాదేవి, సంతోషిమాత, పోచమ్మ అమ్మవార్ల ప్రతిష్ఠా వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈఓ పర్యవేక్షణలో ఆయా ఆలయాల అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై దేవతమూర్తులను దర్శించుకున్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



నార్తలాలాగూడలో సమస్యలు తెలుసుకుంటున్న ఆదం సంతోష్‌కుమార్

అడ్డగుట్ట: బస్తీలలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం అడ్డగుట్ట డివిజన్‌లోని కట్టెల మండి, ఇందిరా నగర్, శేషాపహాడ్, నార్తలాలాగూడ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు బస్తీ బాట నిర్వహించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అనేక బస్తీల్లో డ్రైనేజీ, తాగునీటి, రోడ్లు, విద్యుత్ సంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిత్యం ప్రజల్లోకి వెళ్తున్నారని వివరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బస్తీబాటలో కాంగ్రెస్ నాయకులు ఆదం సృజన్, గంట రాజుసాగర్, శివ కుమార్, అబ్దుల్ నిసార్, అమర్‌నాథ్ గౌడ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేటలోని బుద్ధానగర్‌కాలనీకి నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బాజీబాబా, కాలనీవాసులతో ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బాజీబాబాకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కాలనీవాసులు వినోద్, శ్రీను, బిక్షపతి, జహంగీర్, సుమన్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళలు

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను అసోసియేషన్ కోశాధికారి సుగుణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి కోడె సాంబశివరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు మహిళలకు వివిధ రకాల క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఈనెల 12న బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీలకు కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. సోమవారం కూడా పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: యువ కార్మిక నాయకులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని కార్మిక సమస్యల పై పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 29 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకువచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తూ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని ఆరోపించారు. కార్మిక హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేయాలన్నారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనలో మిలియన్ మార్చ్ కార్యక్రమానికి ప్రత్యేక స్థానం ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్ధన్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక హక్కుగా భావించిన మలిదశ ఉద్యమం విజయ తీరాలకు చేరడంలో మిలియన్ మార్చ్‌ది ప్రధాన ఘట్టం అన్నారు. సీమాంధ్ర దోపిడి దారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించడంతో పాటు ఆనాటి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచిందన్నారు. ఎక్కడ దోపిడీ పీడన, వివక్షత, అణచివేత, అన్యాయం, క్రూర నియంతృత్వం ఉంటుందో, అక్కడ ప్రజా తిరుగుబాటు ఉంటుందని నిరూపించిన మిలియన్ మార్చ్ పాలకులకు నిరంతరం హెచ్చరిక లాంటిదన్నారు.

అనువాద గ్రంథాల ఆవిష్కరణ



అనువాద గ్రంథాల ఆవిష్కరణలో పాల్గొన్న నరసింహప్ప తదితరులు

ఖైరతాబాద్: తెలుగు సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదిస్తున్న భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సేవలు అభినందనీయమని నరసింహప్ప అన్నారు. ఆదివారం ప్రముఖ కన్నడ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ఐఎల్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచారసభలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ మామిడాల శైలజ, యువకవి ధృవనల్లా రాసిన అనువాద గ్రంథాల ఆవిష్కరణ, మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసింహప్ప, తెలుగువన్ యండీ కంఠంనేని రవిశంకర్ పుస్తకాలను ఆవిష్కరించారు. మామిడాల శైలజ రాసిన ‘గతి తప్పిన రుతువు’ నవలను ఆంగ్లంలో ‘ది ఎక్స్ ఆఫ్ సైలెన్స్’ పేరుతో హిందీలో ‘అవికసిత్’ పేరుతో అనువదించడం మంచి పరిణామమని వక్తలు కొనియాడారు. యువకవి ధృవ తెలుగులో రాసిన రెండు రంగుల ఇంద్ర ధనస్సు హిందీలో హిందీలో ‘దో రంగోంకా ఇంద్ర ధనుష్’ పుస్తకాలు అద్భుతంగా ఉన్నాయని కంఠంనేని రవిశంకర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త అలూరు సుభాష్ బాబుకు విద్యా ఉద్యోగ ప్రధాత పేరుతో జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవికా చౌదరి, డాక్టర్ పి.సునందబాయి, వి.శుక్తిమతిలకు జాతీయ జీవన సాఫల్యపురస్కారాలు అందజేశారు. వీరితో పాటు మరో 28 మందికి నేషనల్ లెజెండరీ ఎక్స్‌లెన్ అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్ రాధాకుసుమ ఆధ్వర్యంలో జరిగిన కవిసమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది.

ఘనంగా సాహిత్య సంబరాలు



సాహిత్య సంబరాలను ప్రారంభిస్తున్న ప్రొ. తిరుపతిరావు

లాలాపేట: సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తార్నాకలోని నాగార్జున నగర్ కమ్యునిటీ హాల్లో తార్నాక సాహిత్య సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ టి. తిరుపతిరావు ప్రారంభించారు. కవులు, రచయితలు, పబ్లిషర్స్ ఇందులో పాల్గొన్నారు. వారు రాసిన పుస్తకాలతో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు సమాజాన్ని జాగృతం చేయడంలో సాహిత్యం ప్రాముఖ్యత, గొప్పతనాన్ని వివరించారు. నాగార్జునగర్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రసిడెంట్ జలంధర్‌రెడ్డి, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీ వీసీకి ఓయూలో సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ (వీసీ)గా నియమితులైన ఓయూ టెక్నాలజీ కాలేజీ అధ్యాపకులు ప్రొ.వీసీ బసవరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఓయూలో ప్రొఫెసర్‌గా వివిధ పదవులు చేపట్టిన ఆయన గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. గత నెల రాయలసీమ వర్సిటీకి వీసీగా నియమితులైన సందర్భంగా టెక్నాలజీ కాలేజీ పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు ప్రొ.వీవీ బసవ రావును ఘనంగా సన్మానించారు. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రమేష్‌కుమార్, డా.సాదం ఐలయ్య పాల్గొన్నారు.

కవితను కలిసిన నివేదిత



రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత ఆదివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. బీఆర్ఎస్ నాయకులు గజ్జల గోపాల్ తదితరులతో కలిసి కవిత నివాసంలో ఆమెను కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు.

ఆలయంలో విగ్రహాలు మాయం

అమీర్‌పేట: ఆలయ గర్భగుడిలో దేవుడి విగ్రహాలు మాయమయ్యాయి. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎస్ఆర్‌నగర్ సమీపంలోని గురుమూర్తినగర్‌లో శ్రీ వినాయక దేవాలయం ఉంది. అర్చకుడు నవీన్ కుమార్ ఆలయానికి వచ్చి పూజలు చేసేందుకు గర్భగుడి తెలుపులు తెరిచాడు. లోపల శివుడు, పార్వతి పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. విషయాన్ని ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.నరేందర్‌రెడ్డికి తెలుపడంతో ఆయన ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

కవాడిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను అమ్మకుండా ఆ స్థలాల్లో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. హాస్టల్స్ నిర్వహణ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని మార్చుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



ఎమ్మెల్యే తలసానిని కలిసిన అమీర్‌పేట బుద్ధానగర్ కాలనీవాసులు..

అమీర్‌పేట: కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ బౌద్ధనగర్ కాలనీకి నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బాజీబాబా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాడి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి ఆదివారం వెస్టు మారెడ్‌పల్లిలో ఎమ్మెల్యే తలసానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజీబాబాకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి,కాలనీ వాసులు వినోద్,శ్రీను, భిక్షపతి, జహంగీర్, సుమన్,రాము,గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆదివారం ధ్వజమెత్తారు. కులగణన జరిగిన తర్వత అధిక శాతం బీసీలు ఉన్నారని తెలిసి కూడా అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మంత్రిమండలిలో తీర్మానం చేసి 24 గంటలు గడవక ముందే బీసీలను మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నామని పదే పదే చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ఆస్తులను అమ్ముకొని పార్టీకి సేవలందిస్తున్న బీసీ నేతలకు పదవుల విషయం విస్మరించడం దారుణమన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీల సత్తా చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌యాదవ్, పాలకూరి కిరణ్, చందు, అనంతుల సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్కులలోని చెత్త తరలింపు



పార్కులను శుభ్రం చేస్తున్న సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ సభ్యులు

సనత్‌నగర్: సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని పార్కులను ఆదివారం శుభ్రం చేశారు. పార్కులో పేరుకుపోయిన చెత్త కుప్పలను తరలించారు. కొద్ది రోజులుగా పార్కులను శుభ్రం చేయకపోవడం, ఒకవేళ చేసినా ఊడ్చిన చెత్తను అక్కడే గుట్టగా వేయడంతో వాకర్లు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే సంకేత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మురళి ఫణికుమార్ నేతృత్వంలో సుమారు 15 మంది వలంటీర్లు ఎస్సార్టీకాలనీలోని పార్కు నెంబర్–19, 20, 21లలో పేరుకుపోయిన చెత్తను శ్రమదానం చేసి శుభ్రపరిచారు. ప్రతి ఆదివారం స్వచ్ఛ సనత్‌నగర్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా మురళి ఫణికుమార్ తెలిపారు. స్థానికులు తమ తమ రోడ్లలో ఉన్న ఉద్యానవనాల పరిస్థితిని తమకు తెలియజేయాలని, తద్వారా స్వచ్ఛ సనత్‌నగర్ ద్వారా శ్రమదానం చేసి వాటిని శుభ్రం చేయనున్నట్లు వివరించారు.

ఎంబీఏ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట యూనివర్సిటీ ఎంబీఏ కాలేజీ విద్యార్థులు ఆదివారం ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 11, 12 తేదీలలో ఠాగూర్ ఆడిటోరియంలో జరగనున్న ఈవెంట్ విజయవంతం కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని 130 ఎంబీఏ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. బిజినెస్ క్విజ్, ఇతర పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఈవెంట్‌లో నిర్వహించనున్నట్లు స్టూడెంట్ కన్వీనర్ మితిలేష్ తెలిపారు.



పాఠశాల స్థాయిలో కరాటే నేర్పించాలి



చిన్నారిని అభినందిస్తున్న డా. అందెశ్రీ, నటుడు సుమన్

లాలాపేట: మార్షల్ ఆర్ట్స్‌ను పాఠశాల, కళాశాల స్థాయిలో కచ్చితంగా నేర్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సినీ నటుడు సుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. తార్నాకలో ఆదివారం సాయంత్రం బ్రూస్లీ షాటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా 15వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు ఎన్. శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమన్, పోలీసు డీఎస్పీ లకావత్ దేవలా నాయక్, జైళ్ల శాఖ సూపరెండెంట్ శివ కుమార్ గౌడ్ తదితరులు హాజరై బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. కరాటేతో మానసిక స్థైర్యం వస్తుందన్నారు.ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో కవి గాయకులు డా. అందెశ్రీ, బాలపరమేశ్వర్‌రావు, పర్వీన్,వాసు, నరేష్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలపై ప్రత్యేకంగా ఫోక్సో చట్టం ఉందని దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఇంటిలో ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం తీసుకునే హక్కు భార్యకూ ఉంటుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మహిళలు దేనికీ భయపడాల్సిన అవసరం లేదని వారికి ఎన్నో రకాల చట్టాలు ఉన్నాయని, అలాంటి వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐలు జాతీయ మహిళా కన్వీనర్ సీహెచ్ శైలజ, కో కన్వీనర్ వనజ, ఐలు రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి, మద్రాస్ హైకోర్టు న్యాయవాది చమ్కీ రాజ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

తల్లి, ఇద్దరు పిల్లల అదృశ్యం



అదృశ్యమైన తల్లీ పిల్లలు

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన తల్లీపిల్లలు అదృశ్యమయ్యారు. ఈ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన ఉమా శంకరి(34)కి 13 ఏళ్ల క్రితం దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన శివకుమార్‌తో వివాహం జరిగింది. వీరికి జశ్వంత్(12), వర్షిణి(10) ఇద్దరు పిల్లలు. భర్తతో గొడవల కారణంగా ఉమా శంకరి, తన ఇద్దరు పిల్లలతో ఏడాది క్రితం అడ్డగుట్టకు వచ్చి తన తల్లితో కలిసి ఉంటోంది. కాగా ఈ నెల 7న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన పిల్లలతో బయటకు వెళ్లిన ఉమా శంకరి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో తెలిసిన వారిని, బంధువులను వాకబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం తల్లి లక్ష్మీబాయి తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వ్యక్తి అదృశ్యం



భాస్కర్ (ఫైల్)

అడ్డగుట్ట: మానసికస్థితి సరిగాలేని ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌కు చెందిన రత్నంపోళ్ల భాస్కర్(60)కు మానసికస్థితి సరిగా ఉండదు. దీంతో అతని భార్య పనికి వెళ్లే సమయంలో ప్రతీరోజు భాస్కర్‌ను గదిలో పెట్టి తాళం వెసి వెళ్లేది. ఈ క్రమంలో ఈ నెల 4న ఉదయం పనికి వెళ్తున్న సమయంలో బయటి నుంచి తాళం వేయకుండా వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చే సరికి భర్త భాస్కర్ కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికింది. ఫలితం లేకపోవడంతో ఆదివారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.